# యూరియా..లేదయా

- ఖరీఫ్‌లో 20వేల ఎకరాల్లో పత్తి పంట సాగు
- రైతు సేవా కేంద్రాలకు ఒక్కబస్తా ఎరువు చేరని వైనం
- సొసైటీకి మాత్రమే 18 టన్నులు సరఫరా
- రెండ్రోజుల్లోనే అయిపోయిందని చెబుతున్న సొసైటీ సిబ్బంది
- స్టాక్ లేక అల్లాడుతున్న అన్నదాతలు
- పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



జలదంకిలో సాగులో ఉన్న పత్తి పంట

**జలదంకి:** కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా అవసరమైన మేరకు ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో దుకాణాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మే నెల చివరిలోనే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన మేర ఎరువులను రైతుభరోసా కేంద్రాలకు తరలించి అందుబాటులో ఉంచగా, ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల ద్వారా ఒక్క బస్తా కూడా పంపిణీ చేయడం లేదు. సొసైటీలకు సైతం అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ఎరువుల ధరలు పెంచడంతో పాటు యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని లింక్ పెడుతూ రైతులను దోచుకుంటున్నారు.

**అన్నదాతల పడిగాపులు**

ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 20 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. పత్తి పంటకు మొదటి దఫా యూరియా, డీఏపీ ఎరువుల అవసరం ఎక్కువగా ఉంటుంది. మండలంలో 13 రైతుసేవా కేంద్రాలు ఉండగా ఇప్పటి వరకు ఒక్క బస్తా యూరియాను సరఫరా చేయలేదు. ఇటీవల జలదంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి 18 టన్నుల యూరియాను పంపగా, రెండ్రోజుల్లోనే అయిపోయిందని సొసైటీ సిబ్బంది చేతులెత్తేశారు. దీంతో యూరియా కొరతతో బయట దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కర్షకులు వాపోతున్నారు.

**పట్టించుకోని ప్రభుత్వం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేలకు తరలించి అందుబాటులో ఉంచారు. కానీ ప్రస్తుతం యూరియా మార్కెట్లో సైతం లభించక ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో ఎరువులకు డిమాండ్ ఉంటుందని తెలిసి కూడా ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు**

యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. బయట దుకాణాల్లో కూడా స్టాకు లేకుండా పోయింది. ముందుగా జాగ్రత్త పడి స్టాక్ పెట్టుకున్న కొందరు వ్యాపారులు యూరియా ధరను పెంచి విక్రయిస్తున్నారు. దీనికితోడు తాము సూచించిన బయో ఎరువులను కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరం లేకున్నా బయోఎరువులను కొనుగోలు చేసి యూరియా తీసుకెళ్తున్నారు. కొన్ని కంపెనీలు సైతం యూరియా బస్తా కావాలంటే తమ ఉత్పత్తులను కొనాల్సిందేనని నిబంధనలు పెడుతుండడంతో గత్యంతరం లేక రైతులు వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను కూడా అమ్మాలని డీలర్లపై ఫర్టిలైజర్ కంపెనీలు సైతం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కంపెనీలతో చర్చించి దుకాణదారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

## బస్తా రూ.360వరకు విక్రయం

**దగదర్తి:** మండలంలోని రైతులు రెండో పంట సాగు చేస్తున్న క్రమంలో యూరియాకు డిమాండ్ నెలకొంది. ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచలేదు. రైతులు ముందుగా నగదు చెల్లిస్తే లారీ లోడును అందిస్తామని వ్యవసాయ సహాయకులు చెబుతున్నారు. లారీ లోడు అంటే సుమారు 400 బస్తాలకు ముందుగా నగదు చెల్లించాలంటే ఎలా కుదురుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోనూ యూరియాను అందుబాటులో ఉంచకపోవడంతో ఎరువుల డిపోల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.265 కాగా, వ్యాపారులు రూ.330 నుంచి రూ.360 వరకు విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండో పంట సాగు చేస్తున్న క్రమంలో యూరియాను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి యూరియాను అధిక ధరలు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

### స్టాక్ లేదని చెబుతున్నారు



గతంలో గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందజేసేవారు. ప్రస్తుతం ఎరువులు కావాలంటే జలదంకికి 20 కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. సొసైటీలో యూరియా ఇస్తున్నారని తెలిసి జలదంకికి వచ్చా. తీరా ఇక్కడకు వచ్చాక 18 టన్నులు వస్తే అయిపోయిందని చెబుతున్నారు. బయట డీలర్లు ధరలు పెంచి అమ్మకాలు చేపడుతున్నారు.

– ముచ్చాల కొండారెడ్డి, రైతు, కృష్ణాపాడు

### బయోఎరువులు కొంటే ఇస్తామంటున్నారు



యూరియా కొనాలంటే వారి కంపెనీకి చెందిన ఇతర ఉత్పత్తులను కొనాలని వ్యాపారులు షరతులు పెడుతున్నారు. వాటి విలువ రూ. 700 నుంచి రూ.1000 వరకు ఉంటున్నాయి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా ఉండేవి. ఇప్పుడు రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు లేవు. వ్యవసాయాధికారులకు ఎరువుల సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– కాసు కొండపనాయుడు, దాసరిఅగ్రహారం

### ప్రతిపాదనలు పంపాం

మండలంలోని రైతుసేవా కేంద్రాలకు యూరియాతో పాటు ఇతర ఎరువులు కావాలని ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఎరువులు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం. ధరలు పెంచి ఎరువులు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటాం. యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని డీలర్లు ఒత్తిడి తెస్తే రైతులు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడతాం.

– శ్రీవాణి, ఏఓ, జలదంకి మండలం

## 30లోగా ఎరువుల కోసం నమోదు చేసుకోండి

**మర్రిపాడు:** 2025–26 పొగాకు పంట కాలానికి సంబంధించి ఎరువులు కావాల్సిన రైతులు ఈ నెల 30వ తేదీలోగా సూపర్‌వైజర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పొగాకు అమ్మకాల్లో బ్యారెన్‌కు అడ్వాన్స్‌గా రూ.10వేలు మినహాయించుకుంటామని చెప్పారు. అమోనియం సల్ఫేట్ 12, డైఅమోనియం ఫాస్ఫేట్ 5, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 8 బస్తాలు, కావాల్సిన వారికి కాల్షియం నైట్రేట్ 7 బస్తాలు చొప్పున అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు నియోజకవర్గంలోని రెండో పంట సాగును చేస్తున్న క్రమంలో రైతులకు అవసరమైన మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ వ్యవసాయాధికారులను కోరారు. ఆత్మకూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్క ఆత్మకూరు చెరువు కిందే మూడు వేల ఎకరాల్లో వరి నాటేందుకు రైతులు నార్లు పోసి ఉన్నారని తెలిపారు. ఒక్కో ఎకరాకు కనీసం నాలుగు బస్తాల చొప్పున 12వేల బస్తాల యూరియా అవసరం ఉందని వివరించారు. అలాగే ఆత్మకూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలోని అనంతసాగరం, అనుమసముద్రంపేట మండలాల్లోని రైతులు సైతం ఆత్మకూరులోనే ఎరువులు కొనుగోలు చేస్తుంటారని తెలిపారు. అందుకనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎంపీడీఓకు వినతి

**సీతారామపురం :** తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు సామూహిక సెలవులు మంజూరు చేయాలని పంచాయతీకార్యదర్శులు ఎంపీడీఓ భార్గవిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య పిలుపు మేరకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు.

## క్లుప్తంగా

### శాకంబరిగా ఇష్టకామేశ్వరిదేవి



**సీతారామపురం :** మండలంలోని ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో ఇష్టకామేశ్వరిదేవి శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

### కంప్యూటర్ బహూకరణ



**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి విక్రమ్ కంప్యూటర్‌ను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య విజ్ఞప్తి మేరకు స్పందించి సుమారు రూ.50వేల విలువ చేసే కంప్యూటర్‌ను శుక్రవారం అందజేశారు. దాతను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ మంచికలపాటి మోహన్ పాల్గొన్నారు.

### ఉర్దూ ఉపాధ్యాయుడ్ని నియమించాలని వినతి



**సోమశిల:** మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడ్ని నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా కోరారు. ఈ మేరకు విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉప్పలపాడు ఉర్దూ స్కూల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. అక్కడ ఉర్దూ భాషను బోధించేందుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, దాదా మస్తాన్, రసూల్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయినికి సత్కారం



**కలిగిరి:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కోర్పిపాటి సుగుణమ్మను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుగుణమ్మ అంకితభావంతో విద్యాబోధన చేసి అందరికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు.

### కొండమూరి సంస్మరణ సభ రేపు

**ఆత్మకూరు:** పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో దివంగత నాయకుడు కొండమూరి పెద్దమస్తానయ్య సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు శుక్రవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### లార్వా సర్వే

**వరికుంటపాడు:** స్థానిక ఎస్సీ కాలనీలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే చేపట్టారు. నిల్వ నీటిని తొలగించి దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం

**ఉదయగిరి:** సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరడడమే జైఆంధ్ర సమాచార హక్కు సంఘం లక్ష్యమని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జైఆంధ్ర కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జైఆంధ్ర సమాచార హక్కు చట్టం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యునిగా నియమించిన వెంకటరత్నంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారీగా కన్వీనర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. వారి ద్వారా పేదలకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించి న్యాయం చేస్తామన్నారు.

### బీజేపీలో చేరికలు

**ఆత్మకూరురూరల్:** మున్సిపల్ పరిధిలోని 19వ వార్డుకు చెందిన పలువురు శుక్రవారం బీజేపీలో చేరారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు మున్నా సంతోష్‌కుమార్, పార్టీ నాయకులు కరటంపాటి సుధాకర్, తదితరులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## స్వచ్ఛ కావలిగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

**కావలి ( జలదంకి ):** కావలి మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి ఉత్తర శివారులో ఉన్న డంపింగ్ యార్డులో విండోస్ విధానం ద్వారా సేంద్రియ ఎరువుల తయారీపై మున్సిపల్ సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో స్వచ్ఛ కావలిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ చేపట్టడంతో పాటు పలుచోట్ల డస్ట్‌బిన్లు, ఐరన్ మెస్‌లు ఏర్పాటు చేసి చెత్తను అక్కడే వేయాలని ప్రజలకు సూచిస్తున్నామన్నారు. కావలి కూరగాయల మార్కెట్‌తో పాటు ఇళ్ల నుంచి వచ్చే తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నాయని తెలిపారు. నిత్యం 60 టన్నుల సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అమృత మిత్ర పథకం కింద 3,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సేంద్రియ ఎరువును వినియోగిస్తామన్నారు.

## ముఖఆధారిత హాజరుతో పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ షాను

**సీతారామపురం :** జూలై నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖఆధారిత హాజరుతోనే పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను అంగన్‌వాడీలకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలన్నారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలన్నారు. యాప్‌లకు సంబంధించిన పెండింగ్ డేటా నమోదును నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. యాక్టింగ్ సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## 10న వెంగమాంబకు ఆషాడం సారె



**దుత్తలూరు:** నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 10వ తేదీన ఆషాడ మాసం సారెను సమర్పించనున్నట్లు ఆ ఫౌండేషన్ జిల్లా మహిళా సేవా కన్వీనర్ మాలేపాటి స్రవంతి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను నర్రవాడలోని ఆలయ ఆవరణలో ఆలయ ఈఓ వెట్టిగుంట ఉషశ్రీ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి సారెను సమర్పిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సారెగా సమర్పించి జయప్రదం చేయలని కోరారు. బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రమాదేవి, రాణెమ్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## డీసీపల్లిలో 603 పొగాకు బేళ్ల విక్రయం

**మర్రిపాడు:** మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 603 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 823 బేళ్లు రాగా, 603 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.212.60 ధర పలికినట్లుగా వివరించారు.

**కలిగిరిలో 561 బేళ్ల విక్రయం**

**కలిగిరి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 461 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 561 బేళ్లను తీసుకురాగా, 461 బేళ్లను విక్రయించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.225.96 ధర పలికినట్లుగా వివరించారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



**సోమశిల:** అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సురేష్‌తోపాటు గణిత ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఎస్జీటీ కృష్ణయ్యను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, మదీనా, మాధవి, పెద్దయ్య పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

**కావలి (జలదంకి ):** కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని బైరాగుల వీధిలో మరమ్మతులకు గురైన మంచినీటి పైపులైన్‌కు శుక్రవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. కమిషనర్ మరమ్మతు పనులను పరిశీలించి మాట్లాడారు. పైపులైన్ మరమ్మతులకు గురవడంతో 18వ వార్డు ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. డిప్యూటీఈఈ పీ సాయిరాం, ఏఈ టీ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

**దుత్తలూరు:** నర్రవాడలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఉదయగిరి సీఐ ఎస్ వెంకట్రావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు ఆదిలక్ష్మి, ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డి, రఘునాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



**ఉదయగిరి రూరల్:** ఉదయగిరిలోని బస్టాండ్ సెంటర్‌లో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాల ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు బైకులు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

**సీతారామపురం :** మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఖలీల్‌అహ్మద్‌కు డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ నుంచి జెడ్పీ సీఈఓ కార్యాలయానికి పదోన్నతి ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన త్వరలో ఇక్కడి నుంచి బదిలీ కానున్నారు. కాగా పదోన్నతి పొందిన ఖలీల్‌అహ్మద్‌కు ఎంపీడీఓ భార్గవిరెడ్డితో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**కావలి (జలదంకి):** కావలిలోని 30వ వార్డుకు చెందిన ఆలేటి మధుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.1.25లక్షల నగదు చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బాధితుడికి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌చౌదరి, 30వార్డు ఇన్‌చార్జి గాదంశెట్టి వేణుగోపాల్ శుక్రవారం చెక్కును అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ శ్రీవిద్య, జేఈ నిరంజన్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 7:30 నుంచి 10:30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు.

## చెరువులోని చెట్లు అక్రమంగా నరికివేత



చెట్లను అక్రమంగా నరుకుతున్న కూలీలు

**కలిగిరి:** మండలంలోని చిన్నఅన్నలూరు చెరువులో కలప దొంగలు పడ్డారు. శుక్రవారం చెరువులోని చెట్లను కొందరు యంత్రాల సాయంతో అక్రమంగా నరికివేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ రాగి కుమారి భర్త ప్రసాద్, మరికొందరు రైతులు అడ్డుకున్నారు. చెట్లను నరుకుతున్న వ్యక్తులను పంచాయతీ అనుమతి లేకుండా ఎలా కొడుతున్నారని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడికి డబ్బులు ఇచ్చామని, ఆయన కొట్టుకోమని చెప్పారని కలప కొడుతున్న వ్యక్తులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో ప్రసాద్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొట్టిన కలపను తరలించవద్దని వారికి సూచించారు. కాగా ఈ విషయమై సర్పంచ్ మాట్లాడుతూ చెరువులోని కలపను అక్రమంగా కొడుతున్నారని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంచాయతీ అనుమతులు లేకుండా, వేలం నిర్వహించకుండా కలపను ఎలా కొడుతారని?ఎలా అనధికారికంగా అమ్మకాలు జరుపుతారని? ఆమె ప్రశ్నించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ మాట్లాడుతూ చిన్నఅన్నలూరు చెరువులోని చెట్లను అక్రమంగా కొడుతున్న విషయాన్ని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే చెట్ల నరికివేతను నిలిపివేయించామన్నారు. ఇకపై ఎవరైనా అనుమతులు లేకుండా చెరువులోని చెట్లను కొడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి

**అనుమసముద్రంపేట:** పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం ఇంటింటి చెత్త సేకరణను పర్యవేక్షించాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. నూరుశాతం పన్నుల వసూళ్లను పూర్తిచేసి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**కొండాపురం:** మండలంలోని తూర్పుఎర్రబల్లిలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపీడీఓ ఆదినారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీకార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా ఇంటింటి చెత్తసేకరణను ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి**

**ఆత్మకూరురూరల్:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ రఫీఖాన్ అన్నారు. మండలంలోని నువ్వూరుపాడులో పారిశుధ్యం నిర్వహణను శుక్రవారం ఆయన పరిశీలన చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆరేళ్ల క్రితం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధుల్లో కేవలం రూ.70వేలు మాత్రమే ఖర్చు చేసి మరో రూ.5 లక్షలు మిగిలి ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే సంప కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించలని కోరారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీకార్యదర్శి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఊరచెరువు కట్ట పనులు పూర్తి చేయాలని నిరసన



ఊరచెరువు వద్ద నిరసన తెలుపుతున్న యువకులు

**సీతారామపురం :** స్థానిక ఊరచెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలని యువకులు శుక్రవారం నిరసన తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఊరచెరువుకట్టను ఆధునీకరించి మూలతిరుగుడులో ఎత్తు తగ్గించారన్నారు. 85 శాతం చెరువుకట్టకు రివిట్‌మెంట్ నిర్మించి మిగిలిన 15 శాతం చేపట్టకుండా మధ్యలో వదిలేశారన్నారు. కనీసం ఆ ప్రాంతంలో మట్టికట్ట కూడా ఏర్పాటు చేయలేదన్నారు. రాబోయే వర్షాకాలంలో ఊరచెరువులో నీరు సమృద్ధిగా చేరితే మూలతిరుగుడు ప్రాంతంలో మట్టికట్టతో పాటు రెవిట్‌మెంట్ లేనందున జాతీయ రహదారి కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఊర చెరువులోకి నీరు చేరి ప్రమాదం వాటిల్లకముందే ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయాలి




**కావలి (జలదంకి):** ఉపాధి హామీ పథకం కూలీలకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కావలిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200రోజుల పనిదినాలు కల్పించాలని, దినసరి వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ మాల్యాద్రి, మండలాధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కేవీపీఎస్ జిల్లా సభ్యుడు జాన్, తదితరులు పాల్గొన్నారు.